సాక్షి
విజయనగరం

బుధవారం । 20 । డిసెంబర్ । 2023



ఆమెకే బాధ్యతలు

మహిళా శక్తిని గుర్తించిన ప్రభుత్వం వారిని అడుగుడుగునా ప్రోత్సహిస్తూ ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేస్తోంది. - 8లో



దైవసేవకన్నా మిన్న.. దివ్యాంగులకు సేవ - 8లో

దివ్యాంగులకు సేవ చేయడాన్ని దైవసేవ కన్నా ఎక్కువగా భావించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు.



క్రీడలతో ఆరోగ్యం, ఉల్లాసం

పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించి మొదటిస్థానంలో నిలవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆకాంక్షించారు. - 8లో

న్యూస్‌రీల్

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కమలాపండ్లతో నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

'కోట'లో ఆగనున్న కిరండూల్ ఎక్స్‌ప్రెస్

శృంగవరపుకోట: ఎస్.కోట ప్రజలకు శుభవార్త. విశాఖపట్నం నుంచి కిరండూల్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఎస్.కోట స్టేషన్‌లో ఆగనుంది. దీనివల్ల రాత్రి వేళ విశాఖ నుంచి వచ్చే వందలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇటీవల ఎస్.కోటకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్యాడ ప్రసాద్, చింతల నారాయణమూర్తి, ఆవాల కృష్ణ, శానాపతి ఈశ్వరరావు తదితరులు రైల్వేస్టేషన్‌లోని సమస్యలను తెలియజేశారు. కిరండూల్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కల్పించాలని, రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్యను రైల్వేశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విశాఖ–కిరండూల్ ఎక్స్‌ప్రెస్ 19వ తేదీ నుంచి ఎస్.కోట స్టేషన్‌లో హాల్ట్ ఇస్తూ రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ–కిరండూల్ (18514) ఎక్స్‌ప్రెస్ విశాఖలో రాత్రి గం 9.20కి బయలుదేరి రాత్రి 10.08 గంటలకు ఎస్.కోట చేరుతుంది. తిరిగి 10.10కి బయలుదేరి కిరండూల్ వెళ్తుంది. రైల్వే రిజర్వేషన్ కౌంటర్ అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జిల్లా కమిటీ ఇదే..

విజయనగరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విజయనగరం జిల్లా వైద్యుల విభాగం కమిటీని నియమించినట్టు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటించింది. డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన బొత్స కాశీనాయుడు, ఉపాధ్యక్షులుగా ఎం.ఎస్.ఎస్.మూర్తి (విజయనగరం), ఎస్.వెంకటినాయుడు (శృంగవరపుకోట), ఎ.దివాకర్‌బాబు (రాజాం) నియామకమయ్యారు. జనరల్ సెక్రటరీలుగా బి.అనీల్‌కుమార్ (విజయనగరం), పి.సునీల్‌కుమార్ (బొబ్బిలి), విజయ్‌కిషోర్ (గజపతినగరం), ఆర్.శంకరరావు (విజయనగరం), సీహెచ్ హరిప్రసాద్ (విజయనగరం), బి.రాకేష్ (శృంగవరపుకోట), కార్యదర్శులుగా ఎన్.కె.రావు (బొబ్బిలి), కె.హరిప్రసాద్ (రాజాం), బి.భరత్ (నెల్లిమర్ల), టి.ప్రదీప్ (శృంగవరపుకోట), బి.రవికుమార్ (గజపతినగరం), సీహెచ్ శరత్ (విజయనగరం), సంయుక్త కార్యదర్శులుగా భాగ్యశ్రీ (విజయనగరం), ఎం.స్వాతి (బొబ్బిలి), బి.లావణ్య (శృంగవరపుకోట), ఎస్.పద్మావతి (రాజాం), సునీత (బొబ్బిలి), ఎన్.ఈశ్వరరావు (విజయనగరం) నియామకమయ్యారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

రాజాం సిటీ: ఈ ఏడాది పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధన సాగించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునివ్వాలని బొబ్బిలి డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీ సూచించారు. బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయడం ద్వారా వారిలో సబ్జెక్టుపై మరింత ఆసక్తి పెంపొందించవచ్చన్నారు. ఆయన వెంట ఎంఈఓలు ప్రవీణ్‌కుమార్, దుర్గారావు, హెచ్‌ఎం సీహెచ్ గురుమూర్తి, పి.నాగయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి రామారావు

దత్తిరాజేరు/మెంటాడ: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వి.టి.రామారావు తెలిపారు. పెదమానాపురం, కొత్తబగ్గాం, కొణిశ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. కళ్లాలకు వెళ్లి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఆయన వెంట ఏడీఏ మహరాజన్, ఏఓలు అనూరాధ, ధనలక్ష్మి, వీఏఏ గణపతినాయుడు ఉన్నారు.



నెల్లిమర్లలో ఆరోగ్యశ్రీ కార్డులపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు



రాజాం మండలం అంతకాపల్లిలో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే కంబాల జోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు



గజపతినగరంలో ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

రూ.25లక్షల వరకు ఉచిత వైద్యం

ప్రజారోగ్యమే మహాభాగ్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటుచేసి వైద్యసేవలను పల్లె చెంతకు చేరువచేసింది. ప్రభుత్వాస్పత్రులకు ఆధునిక సొబగులు అద్దింది. తాజాగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవల ఆర్థిక పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచింది. పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యభరోసా కల్పించింది. సేవల తీరును వివరిస్తూ.. ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీని మంగళవారం నుంచి ఊరూరా చేపట్టింది. ఈ బృహత్తర క్రతువులో ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, సిబ్బంది భాగస్వాములయ్యారు. – సాక్షినెట్‌వర్క్



మెరకముడిదాంలో వైఎస్సార్‌ఆరోగ్యశ్రీ కార్డును లబ్ధిదారులకు అందజేస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు



బొబ్బిలి మండలం కలువరాయిలో ఆరోగ్యశ్రీ సేవల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, తదితరులు

అభివృద్ధే అజెండా



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి.రాజేష్



కార్పొరేషన్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్న మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విద్యలనగరం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా.. అన్ని వనరులను సద్వినియోగంచేసుకోవడమే కర్తవ్యంగా.. నగరాన్ని సుందరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దడమే బాధ్యతగా.. ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ప్రధాన అజెండాగా రూపొందించిన విజయనగరం కార్పొరేషన్ అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. గత ఆర్థిక సంవత్సరం కంటే రూ.16.81 కోట్ల మేర పెంచి రూ.158.75 కోట్ల అంచనాతో బడ్జెట్ రూపొందించింది.

విజయనగరం కార్పొరేషన్ అంచనా బడ్జెట్ రూ.158.75కోట్లు

- 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్
- 2023-24 ఆర్థిక సంవత్సరం కంటే రూ.16.81 కోట్ల మేర పెరిగిన బడ్జెట్
- అన్ని రంగాల్లో నగర అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్ కేటాయింపులు: మేయర్ విజయలక్ష్మి

విజయనగరం:

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించడమే అజెండాగా రూ.158,75,66,360 కోట్లతో రూపొందించిన అంచనా బడ్జెట్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం ప్రత్యేక, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్, సాధారణ, మూలధన ఖాతాల ముగింపు నిల్వ రూ.67,22,44,831 కోట్ల మొత్తాన్ని 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభనిల్వగా చూపించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో అన్ని ఖాతా పద్దుల కింద సాధారణ, మూలధనం రాబడి రూ.107,01,02,789 కోట్లు అంచనా వేయగా... మొత్తం ఖర్చు రూ.158,75,66,360 కోట్లుగాను, ముగింపు నిల్వను రూ.15,47,81,260 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో సరిపోల్చుకుంటే రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.16.81 కోట్ల మేర బడ్జెట్ అంచనా పెరిగింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్‌లో భాగంగా షెడ్యూల్ కులములు నివసించే ప్రాంతాల అభివృద్ధికి రూ.82.85 లక్షలు, షెడ్యూల్ తెగల ప్రాంతాల అభివృద్ధికి రూ.41.42 లక్షలు, మాతా శిశు సంక్షేమానికి రూ.27.61 లక్షలు, వికలాంగుల సంక్షేమానికి రూ. 16.57 లక్షలు, మురికివాడల అభివృద్ధికి రూ.2.20 కోట్లు వెచ్చించారు. రానున్న ఆర్థిక సంవత్సర బడ్జెట్‌తో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, గత ఆర్థిక సంవత్సరాల బడ్జెట్ కేటాయింపులు, ఆదాయ, వ్యయాలను కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కిరణ్‌లు కౌన్సిల్ సభ్యులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనరంతరం జరిగిన అత్యవసర సమావేశంలో అజెండాలోని అంశాలను కౌన్సిల్ ఆమోదించింది.

ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి

గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోని విజయనగరం గడిచిన నాలుగున్నరేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి.రాజేష్ పేర్కొన్నారు. అధికారులు ఆదాయ వనరుల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పన్నుల రూపంలో శతశాతం ఆదాయం రాబడితే నగరం మరింత అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు.

ప్రగతి పథంలో విజయనగరం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయిస్తోన్న బడ్జెట్ కేటాయింపుల ద్వారా ఏడాది కాలంలో తరతరాలు మాట్లాడుకునేలా విజయనగరం ప్రగతి పథం పట్టిందని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక సంఖ్యలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోగలిగామని పేర్కొన్నారు. ప్రతీ పైసా పారదర్శకంగా ఖర్చుచేశారన్నారు. రానున్న రోజుల్లో సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ ముచ్చు లయయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దక్షిణామూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు అమ్మాజీరావు, మధుసూదనరావు, వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

2024-25 సంవత్సరపు బడ్జెట్ అంచనా వివరాలు:

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ రూ.158.75 కోట్ల అంచనా బడ్జెట్‌కు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఆమోదించిన బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా ఉన్నాయి.

- నగరంలో అభివృద్ధి పనులకు– రూ.81.47 కోట్లు
- కొత్తగా రోడ్ల నిర్మాణానికి(సాధారణ నిధులు)– రూ.12 కోట్లు
- వివిధ అభివృద్ధి పనులకు(బీపీఎస్ నిధులు): రూ.5 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12 కోట్ల కేటాయింపు
- రూ.1 కోటి వ్యయంతో సచివాలయాలకు పక్కా భవనాల నిర్మాణం
- రూ.2 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం
- రూ.1.50 కోట్లతో పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యత
- రూ.6 కోట్ల సాధారణ నిధులతో మురుగు కాలువలు, కల్వర్టులు నిర్మాణం
- రూ. 1.50 కోట్లతో సెంట్రల్ లైటింగ్, పార్కుల్లో లైటింగ్ ఏర్పాటు
- రూ.1.50 కోట్లతో పార్కులు, క్రీడామైదానాల అభివృద్ధి
- రూ.80 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం
- రూ.2.50 కోట్లతో తాగు నీటి సరఫరాకు కొత్త పైప్‌లైన్‌ల నిర్మాణం
- రూ.1.50 కోట్ల నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- రూ.2 కోట్ల అమృత్ 2.0 నిధులతో అభివృద్ధి పనులు
- రూ. 6 కోట్లతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారం
- రూ.2 కోట్ల ఎన్‌క్యాప్ నిధులతో పట్టణంలో కాలుష్య నివారణ చర్యలు
- రూ. కోటి వ్యయంతో కమ్యూనిటీ భవనాలు, కళ్యాణ మండపాల నిర్మాణం
- రూ. 75 లక్షలతో ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు
- రూ. 1 కోటి వ్యయంతో నగరంలో కొత్త బోరుబావుల ఏర్పాటు
- రూ. 80 లక్షలతో ట్రాఫిక్ ఐల్యాండ్స్ అభివృద్ధి
- రూ.1.50 కోట్లతో చెరువుల సుందరీకరణ, అభివృద్ధి పనులు

ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో నగర అభివృద్ధికి ఖర్చు చేసిన వివరాలు ఇలా...

- రూ.2.63 కోట్లతో నూతనంగా రోడ్ల నిర్మాణం
- రూ.1.77 కోట్లతో కాలువల నిర్మాణం
- రూ.2.07 కోట్లతో తాగునీటి పైప్‌లైన్‌ల ఏర్పాటు
- రూ.31 లక్షలతో సెంట్రల్, జంక్షన్‌లలో లైటింగ్ అభివృద్ధి
- రూ.43.11 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం
- రూ. 4.22 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు
- రూ.1.40 లక్షల నెడ్‌క్యాప్ గ్రాంట్‌తో అభివృద్ధి పనులు
- రూ.12.28 లక్షలతో వాటర్ ఫౌంటెన్‌ల నిర్మాణం
- రూ.56.78 లక్షలతో ట్రాఫిక్ ఐ ల్యాండ్స్ అభివృద్ధి
- రూ.1.02 కోట్లతో పట్టణంలో సుందరీకరణ పనులు
- రూ.1.95 కోట్ల బీపీఎస్ నిధులతో పలు అభివృద్ధి పనులు
- రూ. 45.45 లక్షలతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం
- రూ.58.81 లక్షలతో చెరువుల అభివృద్ధి
- రూ.1.14 కోట్లతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అభివృద్ధి పనులు

రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి

విజయనగరంలో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేలా రూ.158.75 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్టు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి ఉద్ఘాటించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనలు, సలహాలతో నగరాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేస్తున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నగరంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కొనసాగుతుందన్నారు. ఇదే సమన్వయంతో రానున్న రోజుల్లో నగరాన్ని మరింత అభివద్ధి చేపట్టేందుకు కృషిచేస్తామని చెప్పారు. ఖర్చులతో పాటు ఆదాయ మార్గాలను కూడా మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశభవిత

- జీఎంఆర్ ఐటీలో ప్రారంభమైన స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్-2023 గ్రాండ్ ఫినాలే పోటీలు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ శ్రీవాస్తవ

రాజాం సిటీ: విద్యార్థుల చేతుల్లోనే దేశభవిష్యత్తు నిక్షిప్తమై ఉందని విశాఖపట్నంకు చెందిన ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ శ్రీవాస్తవ అన్నారు. జీఎంఆర్ ఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్–2023 గ్రాండ్‌ఫినాలే పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని దేశ అవసరాలకు అనుగుణంగా ముందుకుసాగాలని సూచించారు. కొత్తకొత్త అంశాలను తెలుసుకునేందుకు హ్యాక్‌థాన్ పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి టీమ్ ప్లేయర్స్‌గా ఉండాలని, వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు ఎవరినీ కాపీకొట్టకుండా ఎన్నుకున్న రంగంలో ప్రత్యేకత చాటుకోవాలని తెలిపారు. జీఎస్‌టీయూ జీవీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు మాట్లాడుతూ యువత, విద్యార్థుల వినూత్న ఆలోచనల ద్వారానే దేశాన్ని సుస్థిరమైన రీతిలో అభివృద్ధి చేయడం సాధ్యపడుతుందన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగితే అగ్రస్థానంలో ఉన్న దేశాన్ని చూడగలమని తెలిపారు. జీఎంఆర్ డీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్ మాట్లాడుతూ దేశంలో కేంటాయించిన 47 కేంద్రాల్లో జీఎంఆర్ ఐటీ ఒకటికావడం ఆనందంగా ఉందన్నారు. జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ 11 రాష్ట్రాల నుంచి 27 బృందాలుగా 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. 36 గంటల పాటు సాగనున్న కార్యక్రమంలో విద్యార్థులు సాంకేతికతను ఉపయోగించి నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ అట్టాడ వెంకటరమణ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



హ్యాక్‌థాన్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

బాలికపై అత్యాచారయత్నం

- తొమ్మిదేళ్ల చిన్నారిపై 55 ఏళ్ల వ్యక్తి ఘాతుకం
- బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వెలుగులోకి..
- పోక్సో కేసు నమోదు

బొండపల్లి: అభంశుభం తెలియని తొమ్మిదేళ్ల గిరిజన బాలికకు మాయమాటలు చెప్పి 55 ఏళ్ల వయసున్న వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన విజయనగరం జిల్లా బొండపల్లి మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. ప్రతిరోజూ బాలిక చదువుకునేందుకు తమ నివాసం నుంచి పక్క గ్రామంలోని పాఠశాలకు వెళ్లివస్తుండేది. బాలిక రాకపోకలు గమనించిన బంగారు పైడిరాజు బాలికను మాయమాటలతో నమ్మకం కలిగించాడు.

ఈ నెల 15న మార్గంమధ్యలో ఉన్న పొదలచాటుకు తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు ఆలస్యంగా తెలియజేసింది. వారు వెంటనే బొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సోచట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్.రవి మంగళవారం తెలిపారు.

మూడు నాటు తుపాకుల స్వాధీనం

- తయారీదారుడు అరెస్టు

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం గ్రామంలో నాటు తుపాకుల తయారీ కేంద్రపై ఎస్‌ఐ ఎస్.ముకుందరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడిచేశారు. తయారీదారుడు ముసినాన కన్నబాబు(63)ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కన్నబాబు తన ఇంటికి ఆనుకొని ఉన్న గుడిసెలో కొద్దికాలంగా రహస్యంగా నాటుతుపాకులను తయారు చేస్తున్నట్టు గుర్తించాం. తయారీకేంద్రంపై దాడిచేసి 90 శాతం తయారీ పూర్తిచేసుకున్న మూడు తుపాకులు, గొట్టాలను, సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కన్నబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఏడేళ్ల కిందట ఆయన నాటుతుపాకుల తయారీ కేసులో నిందితుడని పేర్కొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు

యథావిధిగా అంగన్‌వాడీ కేంద్రాలు



రాజాం సిటీ: బుచ్చెంపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం సిటీ: అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తున్నాయని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్నట్టు వెల్లడించారు. రాజాం మున్సిపాల్టీ పరిధి మారుతీనగర్, బుచ్చెంపేట అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. కేంద్రాల్లోని పిల్లల హాజరుశాతంతో పాటు స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించి భోజన తయారీపై ఆరా తీశారు. ఉదయం 9 గంటలకే పిల్లలను కేంద్రాలకు తీసుకువచ్చే బాధ్యతను వలంటీర్లు తీసుకోవాలన్నారు. పాఠశాలల భోజన నిర్వాహకులు పిల్లలందరికీ ప్రతిరోజు మధ్యాహ్నభోజనం అందజేయాలన్నారు. ఉడికించిన గుడ్లు, పాలు, పోషకాహారాన్ని ఇవ్వాలని వలంటీర్లను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎస్.కె.రాజు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఇన్‌చార్జి కమిషనర్ ఎం.వి.నాగరాజు, ఐసీడీఎస్ పీఓ కనకదుర్గ, సూపర్‌వైజర్ కల్యాణి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీపీటీఓ


డీపీటీఓ టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: ప్రయాణికుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా ఆర్టీసీ అహర్నిశలు కృషి చేస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని కార్యాలయంలో డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో ప్రజారవాణా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు తమ పరిధిలో సమస్యలను ఫోన్ 9959225605 నంబర్‌కు కాల్ చేసి తెలపవచ్చని సూచించారు.

ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధం


కాలుతున్న స్కూటీ,(ఇన్‌సెట్లో) బూడిదైన స్కూటీ

సీతంపేట: స్థానిక ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న పెద్దింటి అప్పలనాయుడుకు చెందిన ఎలక్ట్రికల్ స్కూటీ మంగళవారం ఉదయం దగ్ధమైంది. ఎప్పటి లాగానే ఇంటివద్ద స్కూటీకి చార్జింగ్ ఉదయం 8 గంటలకు పెట్టగా 9 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వచ్చి కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళన చెంది వెంటనే వచ్చి అదుపు చేశారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురు నిందితులను టూటౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ ఎస్.హెచ్. విజయానంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలానికి చెందిన పసల రాజేష్, సమ్మోతు గణేష్‌లు ఒడిశాలోని సిమిలిగూడలో అమిత్ ఖోస్లా, మనోజ్ సబర్‌ల దగ్గర కిలో రూ.200 చొప్పున గంజాయిని కొనుగోలు చేసి నలుగురు వస్తుండగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన టూటౌన్ పోలీసులు నిఘా పెట్టి స్థానిక జేఎన్‌టీయూ, గిరిజన యూనివర్సిటీ సమీపంలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 కిలోల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్‌లు, ఒక మోటార్ సైకిల్ రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

- జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి


జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌ల పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. వారిలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ఏపీఎస్‌ఆర్‌టీసీ రీజినల్ బోర్డు చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఏపీ క్రియేటివ్, కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ వంగపండు ఉష ఉన్నారు. ప్రభుత్వం తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకూ వీరంతా పదవుల్లో కొనసాగనున్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి జీసీసీ ద్వారా కృషి చేయడానికి మరోసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఒక గిరిజన బిడ్డగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి పేర్కొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పార్వతీపురం టౌన్: స్థానిక బెలగాం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని జీఆర్‌పీ సిబ్బంది గుర్తించారు. విశాఖపట్నం నుంచి రాయగడ వెళ్లే మార్గమధ్యంలో రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలిసినవారు పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్‌లోని జీఆర్‌పీ కార్యాలయంలో సమాచారం అందించాలని జీఆర్‌పీ సిబ్బంది కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

ఆమెకే బాధ్యతలు

- మహిళా సంఘాలకు జేజేఎం పనుల బాధ్యత
- క్యాబినెట్ నిర్ణయంతో కుళాయి పనులకు మోక్షం


మహిళా సంఘాల సభ్యులు

విజయనగరం గంటస్తంభం: మహిళా శక్తిని గుర్తించిన ప్రభుత్వం వారిని అడుగడుగునా ప్రోత్సహిస్తూ ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలోని నాడు నేడు పనులను మహిళా సంఘాలకు అప్పగించిన ప్రభుత్వం తాజాగా జలజీవన్ మిషన్ పనులు కూడా వారికే అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా అధికారులు పంపిన ప్రతిపాదనలకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో కుళాయి పనులకు మోక్షం కలగడమే కాకుండా మహిళలు ఆర్థికంగా బలోపేతం కానున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జల్‌జీవన్ మిషన్ పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు విజయనగరం జిల్లాలో రూ.900 కోట్లతో 2411 పనులు మంజూరయ్యాయి. ఇప్పటికే జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పథకంలో మంచినీటి పథకాలు, పైప్‌లైన్ల ఏర్పాటు, ఇంటింటి కుళాయిల నిర్మాణం జరుగుతోంది.

743 పనులకు ఖరారు కాని టెండర్లు

జిల్లాలో మంజూరైన జల్‌జీవన్ మిషన్ పనుల్లో కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమై పనులు పూర్తికాగా, మరికొన్ని మధ్యలో ఉన్నాయి. తొలివిడత కింద 1111 పనులు మంజూరుకాగా, రెండో విడత కింద 1300 పనులు మంజూరయ్యాయి. ఈపనులు కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టాలని ప్రభుత్వం ముందుగా నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా అధికారులు టెండర్లు ఆహ్వానించారు. తొలివిడత మంజూరైన పనుల్లో 1048 పనులకు కాంట్రాక్టర్లు టెండర్లు వేసి పనులు ప్రారంభించారు. రెండో విడతలో 680 పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఇందులో కూడా చాలావరకు పనులు ప్రారంభమై జరుగుతున్నాయి. అయితే మిగతా పనులకు కాంట్రాక్టర్లు టెండర్లు వేయలేదు.

టెండర్లు ఖరారు కాని పనుల అప్పగింత

జల్‌జీవన్ మిషన్‌లో టెండర్లు ఖరారు కాని పనులను మహిళా సంఘాలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాడు నేడు పథకం కింద పాఠశాలల్లో చేపడుతున్న పనులు చాలా వరకు మహిళా సంఘాలకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ పనులను వారు విజయవంతంగా అప్పగించారు. ఈ క్రమంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ పద్ధతిలో మహిళా సంఘాలకు జల్‌జీవన్ మిషన్ పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. అంతేకాకుండా ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదం కూడా తెలిపింది. దీంతో అధికారులు పనులు వారికి అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నారు. పార్ట్ ఎ కింద వారితో కుళాయిలు వేయించడం, పైప్‌లైన్ పనులు చేపట్టనున్నారు. పార్ట్ బి కింద పెద్ద పనులు కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. ఈ మేరకు జిల్లాలో 620 పనులు మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్న మహిళా సంఘాల సభ్యులను జలసంఘాలుగా ఏర్పాటు చేసి వారి ద్వారా పనులు నిర్వహించనున్నారు. తద్వారా మహిళాసంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం కానున్నారు.

విధివిధానాలు రావాల్సి ఉంది

జల్‌జీవన్ మిషన్ పథకంలో కొన్ని పనులు మహిళా సంఘాల ద్వారా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు క్యాబినెట్ కూడా ఆమోదం తెలిపింది. మహిళా సంఘాల ఆసక్తిని ముందే తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా వారికి అప్పగించాలని నిర్ణయం తీసుకుంది. అయితే పూర్తిస్థాయి విధివిధానాలు జీవో రూపంలో రెండుమూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది.

– ఉమాశంకర్, ఎస్‌ఈ, గ్రామీణ నీటిసరఫరా విభాగం, విజయగనరం

ఘనంగా జిల్లా ఐక్య క్రిస్మస్ వేడుక


దైవ సందేశాన్ని అందజేస్తున్న దైవవర్తమానికులు డాక్టర్ జుహానీ హాలోనన్

విజయనగరం టౌన్: సర్వమానవాళికి క్రీస్తు బోధనలు అనుసరణీయమని పార్లమెంట్ మాజీ సభ్యురాలు డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా ఐక్య క్రిస్మస్ వేడుకలు స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండ్స్‌లో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ యేసే లోకరక్షకుడని, ఆయన అందరికీ సమాధానం కలుగజేస్తాడన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వర్‌కౌశిక్ మాట్లాడుతూ క్రీస్తు ప్రేమ విశ్వమంతటికీ ఆదర్శనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు విక్రమ్ క్యాండిల్ వెలిగించారు. డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అతిథులతో కలిసి కేక్ కట్ చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. డాక్టర్ జుహానీ హాలోనన్ దైవ వర్తమానాన్ని అందజేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డాక్టర్ ఎం. ఐసాక్ గ్రీటింగ్స్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతిథులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. బిషప్ ఎం.పాల్సన్, రెవరెండ్ ఎస్.మధు, రెవరెండ్ పి.ప్రేమానందం, రెవరెండ్ ఉదయ చంద్ర తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ నాసిర్, పీటీసీ ప్రిన్సిపాల్ టి. ఆనందబాబు, డాక్టర్ ఎం.శశిభూషణరావు, రెవరెండ్ డి.ఎలీషా, డాక్టర్ చార్లీ టామ్, ఎల్.మధుసూదన్, జయప్రకాశ్, ఎస్.జాన్, జి.శ్రీధర్, యడ్ల్బాజు చౌదరి, బి.ఆనంద్, పట్నాల పైడిరాజు, అధిక సంఖ్యలో దైవజనులు, విశ్వాసులు పాల్గొన్నారు.

తెలంగాణలో బొబ్బిలి వాసుల మృతి

బొబ్బిలి: తెలంగాణలోని సంగారెడ్డిలో లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో బొబ్బిలి మండలం దిబ్బగుడివలసకు చెందిన తల్లీకొడుకులు మృతి చెందారు. గ్రామానికి చెందిన కొట్నాన సత్యనారాయణ పదేళ్ల క్రిందట ఉపాధి కోసం సంగారెడ్డి వెళ్లిపోయాడు. అక్కడ ఫార్మా కంపెనీలో పని చేస్తుండగా నాలుగేళ్ల క్రితం మండలంలోని రాజుపేటకు చెందిన మహేశ్వరితో వివాహమైంది. వారికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. హైదరాద్‌లోని వారి బంధువుల ఇంటికి సత్యనారాయణ, భార్య మహేశ్వరి, కుమారుడు దేవాన్ష్ బైక్‌పై వెళ్తుండగా వెనుకనుంచి లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మహేశ్వరి, దేవాన్ష్ మృతి చెందగా సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎస్‌డీఎస్ కళాశాల విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోని ఎస్‌డీఎస్ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలలో సెకెండ్ బీఎస్సీ చదువుతున్న జి.వాసు ఆంధ్రయూనివర్సిటీ తరఫున అథ్లెటిక్స్ విభాగంలో రేస్‌వాక్‌లో పాల్గొని బంగారు పతకం సాధించి జాతీయస్థాయి ఇంటర్ వర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడు. తమిళనాడులో జరగనున్న జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నాడు. అదేవిధంగా తృతీయ సంవత్సరం బీఎస్సీ చదువుతున్న సీహెచ్.బాలరాజు ఆంధ్ర యూనివర్సిటీ తరఫున ఖోఖో పోటీలకు పురుషుల విభాగంలో ఎంపికయ్యాడు. కేరళరాష్ట్రంలోని కాలికట్ యూనివర్సిటీలో జరగనున్న సౌత్ ఇండియన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ప్రతిభ కనబరిచిన ఈ క్రీడాకారులను కళాశాల ప్రతినిధులు టి.కమలాకరరావు, బి.రవి, సురేష్, బి.శ్రీనివాసరావులు అభినందించారు.

21న ఓటరు జాబితా పరిశీలకుడి రాక

విజయనగరం అర్బన్: జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి జె.శ్యామలరావు ఈ నెల 21న తేదీన గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఆయన కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారని ఓటర్ల జాబితా విషయమై విన్నవించదలుచుకున్న ప్రజలు ఆయనను కలెక్టరేట్‌లో కలవవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీఅనిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక సమ్మరీ రివిజన్–2024లో భాగంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాను అక్టోబర్ 27న ప్రచురించి జాబితాను జిల్లాలో గల అన్ని రాజకీయ పార్టీలకు సరఫరా చేశామని తెలిపారు. ఈ జాబితాకు సంబంధించి ఈ నెల 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించామని వివరించారు.

పుస్తెలతాడు చోరీ

జామి: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఉపాధిహామీ క్షేత్రసహాయకురాలు వేచలపు సత్యవతి మెడలోని పుస్తెలతాడు చోరీకి గురైంది. వివరాలిలా ఉన్నాయి. బంధువుల ఇంటికి మంగళవారం స్కూటీపై అలమండ వెళ్లి తిరిగి జామి కార్యాలయానికి వస్తున్న సమయంలో రామయ్యపాలెం సమీపంలో ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి అరకు వెళ్లేందుకు ఆమెను అడ్రస్ అడిగారు. అంతలో వెనుకనుంచి ఓ దుండగుడు ఆమె మెడలోని పుస్తెలతాడు లాక్కున్న అనంతరం ముగ్గురూ బైక్‌పై పరారయ్యారు. రెండున్నర తులాల బంగారం పుస్తెలతాడు చోరీకి గురైనట్లు బాధితురాలు జామి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

దైవసేవ కన్నా మిన్న.. దివ్యాంగులకు సేవ


ట్రస్టు ఆధ్వర్యంలో తయారు చేస్తున్న కృత్రిమ అవయవాల గురించి వివరిస్తున్న చైర్మన్ జగదీష్‌బాబు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: దివ్యాంగులకు సేవ చేయడాన్ని దైవ సేవ కన్నా ఎక్కువగా భావించాలని, వారిని ఎప్పుడూ భారంగా అనుకోకూడదని, అన్ని రంగాల్లో వారికి ప్రాధాన్యం కల్పించాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టులో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలిమ్ కో, జిల్లా అధికార యంత్రాంగం సంయుక్తంగా చేపట్టిన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కోసం గుర్తింపు శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ముందుగా గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కృత్రిమ అవయవాల తయారీ, ఫిజియోథెరపీ తదితర కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని హితవు పలికారు. దివ్యాంగులకు గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎనలేని సేవలు అందుతున్నాయని ప్రశంసించారు. దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు గుర్తింపు శిబిరాలను ప్రతి ఆరునెలలకు ఒకసారి నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దివ్యాంగులకు ప్రముఖ స్థానం కల్పించాలి

అనంతరం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగులను దేవతామూర్తులుగా చూడాలని పిలుపునిచ్చారు. వారికి మనోధైర్యం కల్పించి సమాజంలో అన్ని రంగాల్లో ప్రముఖ స్థానం కల్పించాలని కోరారు. దివ్యాంగుల సేవకే గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తన జీవితాన్ని అంకితం చేశారని ప్రశంసించారు. ఉపకరణాలు అందించేందుకు నిర్వహించిన ఈ శిబిరంలో వెయ్యిమందిని గుర్తించినట్లు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఎ.డి జగదీశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి భాస్కరరావు, రవికుమార్, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య, రామస్వామి, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు మేలాస్త్రీ అప్పారావు, కేవీ సూర్యనారాయణ రాజు(పులిరాజు) తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీ మహిళా జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: రాజమండ్రి ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ పోటీల్లో స్త్రీల విభాగంలో పాల్గొననున్న జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) జట్టు జాబితాను యూనివర్సిటీ మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేవెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల యూనివర్సిటీ అనుబంధ కళాశాల విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ విశాఖ కళాశాల క్రీడామైదానంలో జరిగిన అంతర యూనివర్సిటీ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాకారులు ప్రతిభ చూపడంతో వారంతా జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ఎంపికైన వారు వీరే..

జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ మహిళా జట్టుకు ఎంపికైన వారిలో ఎం.లక్ష్మీశ్రీ సౌమ్య (విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దువ్వాడ, విశాఖ), ఎస్.కె.రిజ్వానా ఖతున్ (రఘు ఇంజినీరింగ్ కాలేజ్ ఎ, విశాఖ), పి.డింపుల్ హనీషా (విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ టెక్నాలజీ, దువ్వాడ, విశాఖ), ఇ.జ్ఞాన ప్రసన్న (విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్, విశాఖ), ఎస్.జస్మిత (విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ, విశాఖ) ఉన్నారు. ఎంపికైన జట్టు సభ్యులను వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏవీపాపారావు, స్పోర్ట్స్ డైరెక్టర్స్ డాక్టర్ కె.నాగరాజు, ఎం.ఎల్లారీశ్వరి అభినందించారు.

క్రీడలతో ఆరోగ్యం, ఉల్లాసం


కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో భాగంగా బెలూన్స్ వదులుతున్న కలెక్టర్ నాగలక్ష్మి


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- రాష్ట్రస్థాయి మహిళల ఆహ్వానపు కబడ్డీ పోటీలు ప్రారంభం

విజయనగరం: పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించి మొదటిస్థానంలో నిలవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆకాంక్షించారు. క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం వస్తుందని హితవు పలికారు. ముఖ్యంగా మహిళలకు ఫిట్‌నెస్ చాలా అవసరమని, అందుకోసం వ్యాయామం చేయాలని, అప్పుడప్పుడూ క్రీడలు ఆడుతూ ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో, కార్పొరేషన్ మహిళా విభాగం సారథ్యంలో మూడు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలను కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. నగరంలోని మహిళా పార్కులో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎనిమిది జట్లు తలపడనున్నాయి.

క్రీడలతో మానసిక దృఢత్వం

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటల వల్ల క్రీడాస్ఫూర్తితో పాటు వినోదం కూడా కలుగుతుందని, మానసికంగా దృఢంగా ఉండడానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. 15 ఏళ్ల పైబడిన వారంతా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అన్ని రకాల క్రీడలను మహిళలు ఆడాలని పిలుపునిచ్చారు. మహిళా పార్కులో మహిళల వ్యాయామం కోసం అనేక రకాల పరికరాలను కార్పొరేషన్ వారు ఏర్పాటు చేశారన్నారు. నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కబడ్డీ పోటీలలో పాల్గొనేందుకు 8 జిల్లాల నుంచి మహిళలు విచ్చేశారని తెలిపారు. ఈ పోటీలలో మొదటి బహుమతిగా రూ.50వేలు, 2వ బహుమతి రూ.40 వేలు, 3వ బహుమతి రూ.30 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ అస్మా ఫరీన్, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ శశిభార్గవి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.